www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 20 అక్టోబర్ 2024
5
చిత్తూరు



22 నుంచి గ్రామసభలు : తహశీల్దార్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు

గత ప్రభుత్వంలో చేసిన భూముల రీసర్వేలో జరిగిన తప్పులు ఒప్పులను సరిదిద్దుకోవడానికి మండలంలో ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు జరిగే గ్రామసభలను రైతులు ఉపయోగించుకోవాలని తహశీల్దార్ చంద్రశేఖర్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 22న ఎల్లాపల్లి, 23న ఆంబోదరపల్లి, 24న అగరమంగళం, 25న పాతపాళ్యం, 26న కొత్త వెంకటాపురం, 29న కొండేపల్లి, 30న ఎర్రబోడి రెడ్డికండిగ, నవంబర్ నెల 5న కోటాగరం, 6న నల్లరాళ్లపల్లి, 7న ఆత్మకూరు, 8న కలిజవేడు, 12న నెల్లేపల్లి, 13న బీసీ కండ్రిగ, 14న వీరక నెల్లూరు, 15న మహదేవ మంగళం, 19న 100 గొల్లపల్లి, 20న పెద్దకాల్వ, 21న చిన్నవేపంజేరి, 23న కొట్రకోన, 26న వరత్తూరు 27న పాచిగుంట గ్రామాల్లో రీసర్వేకి చెందిన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



హైవే పనులను పరిశీలిస్తున్న జెసి, డిఎస్పీ

హైవే పనులను అడ్డుకుంటే చర్యలు

జెసి విద్యాధరి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం

హైవే పనులు అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ విద్యాధరి హెచ్చరించారు. శనివారం మండలంలోని బలిజపల్లి గ్రామసమీపంలోని కళా గ్రాండ్ హోటల్ హైవే పనుల్లో భాగంగా తొలగించడానికి ఎక్స్ప్రెస్ హైవే సిబ్బంది పనులు చేపడుతుండగా కళా గ్రాండ్ హోటల్ యజమానులు అడ్డుకున్నారు. ఎక్స్ప్రెస్ హైవే నిర్వాహకులు ఉన్నత అధికారులకు సమాచారం ఇవ్వడంతో కలెక్టర్ స్పందించి జాయింట్ కలెక్టర్ విద్యాధరి, చిత్తూరు టౌన్ డిఎస్పి సాయినాథ్ సిబ్బందిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక తెలపాలని ఆదేశించారు. జెసి, డిఎస్‌పి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం వారు హోటల్ యాజమాన్యంతో మాట్లాడుతూ నష్టపరిహారాన్ని ఇదివరకే నేషనల్ హైవే అథారిటీ అందించినప్పటికీ అడ్డుకుకోవడం నేరమన్నారు. ఇలా హైవే పనులను అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 22వ తేదీ లోపు హోటల్‌ను ఖాళీ చేయాలని నోటీసులు అందించారు. జెసి వెంట తహశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్, సిఐ కత్తి శ్రీనివాస్, నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది పాల్గొన్నారు.

'నిధులు మంజూరు చేయండి'

చంద్రబాబుకు విన్నవించిన ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి విన్నవించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశంలో భాగంగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్యమంత్రిని, సంబంధిత శాఖల మంత్రులను కలిసి వినతిపత్రాలు అందించారు. ప్రధానంగా చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల పరిధిలో రైతుల కోసం చెరువుల నిర్వహణ చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. రైతులకు ఎంతో అవసరమైన చెరువుల నిర్వహణ, చెక్ డ్యామ్‌ల మరమ్మతులు, కొత్త వాటి నిర్మాణంపై గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించిందని, ఫలితంగా వర్షపు నీటిని నిల్వ చేసే సామర్థ్యం తగ్గిపోయిందన్నారు. చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల పరిధిలో 280 చెరువుల మరమ్మతులు, నిర్వహణ, నూతన చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి రూ.33.44కోట్లు అవసరం అవుతుందని అధికారులు అంచనాలు తయారు చేసినట్లు వివరించారు. చిత్తూరు నగరంలోని నీవానది ఆధునీకరణ కోసం రూ.175 కోట్లు మంజూరు చేయాలన్నారు. 2018 టిడిపి హయాంలో చిత్తూరు నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు గాను నీటి సరఫరా కోసం అమృత్ పథకం కింద మంజూరు చేయబడి 75శాతం పూర్తయి అనంతరం వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిన అడవిపల్లి రిజర్వాయర్ నుండి పైప్ లైన్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి చిత్తూరు నగర ప్రజలకు నీరు అందించాల్సిందిగా కోరారు. నియోజకవర్గంలో నాలుగు ప్రధాన రహదారుల అభివృద్ధి కోసం రూ.11.50కోట్లు, చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు, చెన్నై – బెంగళూరు మధ్య చిత్తూరు నియోజకవర్గ పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు, టూరిజం, హెల్త్ కేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వినతులపై ముఖ్యమంత్రి, మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

'వైద్య సేవలు యాప్‌లో నమోదు చేయాలి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి ఆధ్వర్యంలో ఐహెచ్‌ఐపి, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై వైద్యాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐహెచ్‌ఐపి ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్రోగ్రామ్ కింద ప్రతి పిహెచ్‌సిలో జరిగే అన్ని రకాల ఓపి సేవలను ఈ యాప్‌లో పొందుపరచాలి. అలాగే రక్త పరీక్షల సేవలను, ఫీల్డ్‌లో ఆరోగ్య కార్యకర్తలు చేసిన రక్తపరీక్షలను, వివిధ రకాల ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అందించిన సేవలను ఈ ఫోర్టల్‌లో తప్పక ప్రతిరోజు నమోదు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పైన ప్రతి డెలివరీ కేసు బిడ్డకు 24 గంటల లోపల అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చి యూవిన్ యాప్‌లో అప్లోడ్ చేయాలని డాక్టర్ హనుమంతరావు తెలిపారు. దీని ద్వారా ఏఏ రకాల వ్యాధులు ఎక్కడెక్కడ ఎక్కువగా ఉన్నాయో ముందుగానే తెలుస్తుందని, తద్వారా మనం ఇవ్వవలసిన సేవలకు అన్ని రకాల ప్రణాళికలు వేసుకొని సేవలు అందించడానికి సులభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎల్సిడి కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష, ఎపిడీ మియాలజిస్ట్ శ్రీవాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఓ

ట్రాక్టర్లు ఏవి.?

- ఆర్‌బికేల్లో కానరాని వైఎస్ఆర్ యంత్రసేవా ట్రాక్టర్లు
- వృథా అవుతున్న ప్రజాధనం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

వ్యవసాయ రైతులకు చేయూతను అందించేలా గత ప్రభుత్వం వైఎస్ఆర్ యంత్రసేవ పేరుతో వ్యవసాయ రైతులకు యంత్రాలు, ట్రాక్టర్లు సబ్సిడీ ధరలకు అందించింది. ట్రాక్టర్లు సబ్సిడీతో పొందిన రైతు సంఘాలతో పాటు స్థానిక ఆర్‌బికె కేంద్రం అందుబాటులో ఉంచి, ఇతర వ్యవసాయ రైతులకు తక్కువ అద్దె ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ప్రభుత్వ ఉద్దేశం బాగున్నా సబ్సిడీతో పొందిన ట్రాక్టర్లు మాయమయ్యాయి. కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల పేరుతో రైతుల గ్రూపుగా ఏర్పడి సబ్సిడీ ధరకు ట్రాక్టర్లు పొందారు. ఇతర రైతులకు అందుబాటులో ఉంచేలా కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు, ఆర్‌బికె కేంద్రాల్లో ఏర్పాటు చేయాలి. 2022 జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా పెద్దసంఖ్యలో వ్యవసాయ రైతులకు నాటి రాష్ట్ర ప్రభుత్వం రైతువాట 10శాతం, ప్రభుత్వ సబ్సిడీ 40శాతం, బ్యాంకు రుణం 50 శాతంతో ట్రాక్టర్లు పంపిణీ చేసింది. చిత్తూరు జిల్లాలో దాదాపు 40కి పైగా వైఎస్ఆర్ యంత్రసేవ పేరుతో ట్రాక్టర్లు పంపిణీ చేసింది.



సబ్సిడీతో వైఎస్ఆర్ యంత్రసేవ పేరిట పంపిణీ చేసిన ట్రాక్టరు

ఆర్‌బికే కేంద్రాలో కానరాని ట్రాక్టర్లు..

ఆర్‌బికె కేంద్రాల్లో వ్యవసాయ రైతులకు అందుబాటులో ఉండాల్సిన సబ్సిడీ పేరుతో పొందిన ట్రాక్టర్లు నేడు కనిపించడం లేదు. 2022లో వైఎస్ఆర్ యంత్రసేవ పేరుతో ప్రభుత్వం సబ్సిడీతో పొందిన ట్రాక్టర్లు స్థానికంగా నాటి అధికార పార్టీకి చెందిన వ్యక్తులు తమకు అనుకూలమైన రైతులను కలుపుకొని గ్రూప్ ఏర్పాటు చేసి సబ్సిడీతో ట్రాక్టర్లు పొందారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా ప్రభుత్వ సబ్సిడీతో పొందిన ట్రాక్టర్లను ఆర్‌బికె కేంద్రాల వద్ద ఉంచకుండా తమ ఇండ్ల వద్దే ఉంచుకొని వాడుకుంటున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్ ప్రారంభంలో ట్రాక్టర్లకు గిరాకీ ఎక్కువగా ఉంటుందని ఆ సమయాల్లో కూడా ప్రభుత్వ సబ్సిడీతో పొందిన ట్రాక్టర్లను ఆర్‌బికె కేంద్రాల వద్ద ఇతర రైతులకు తక్కువ అద్దెకు ఇచ్చేలా అందుబాటులో ఉంచకపోవడంతో ఎక్కువ అద్దెకు ఇతర ప్రాంతాల నుండీ ట్రాక్టర్లు తీసుకోవాల్సి వస్తోందంటున్నారు.

ప్రజాధనం వృథా..

గత ప్రభుత్వం వ్యవసాయ రైతులకు మేలు చేసేలా వైఎస్ఆర్ యంత్రసేవ పథకం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,500 కోట్లు ఖర్చు చేసి 2,2,62 ట్రాక్టర్లు పంపిణీ చేసింది. ఇందుకోసం 40 శాతం ప్రభుత్వ సబ్సిడీ కోసం ప్రజాధనం ఖర్చు చేసింది. 40 శాతం సబ్సిడీతో రైతు సంఘాలకు పంపిణీ చేసి ట్రాక్టర్లు వ్యవసాయ రైతులకు అందుబాటులో లేకపోవడంతో ప్రజాధనం వృథాయిందనే చెప్పాలి. ప్రభుత్వ సబ్సిడీతో ట్రాక్టర్లు పొందిన రైతు సంఘాలు (గ్రూపు)లు తప్పనిసరిగా ఆర్‌బికె కేంద్రాల పరిధిలోని కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లలో అందుబాటులో ఉంచాలనే నిబంధనలు ఉన్నాయి. నిబంధనలు పటించక ఇతర రైతులకు అందుబాటులో ఉంచకుండా ఇండ్ల వద్దే ట్రాక్టర్లు ఉంచుకున్న వారిని వ్యవసాయశాఖ అధికారుల, ఆర్‌బికె కేంద్రాల నిర్వాహకులు ప్రశ్నించకపోవడంతో ఇష్టారాజ్యంగా ప్రభుత్వం సబ్సిడీతో పొందిన ట్రాక్టర్లను సొంత అవసరాల కోసం వాడుకుంటూ సామాన్య రైతులకు అందుబాటులో లేకుండా చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ప్రభుత్వ యంత్రాగం, వ్యవసాయశాఖ ప్రభుత్వ సబ్సిడీతో పొందిన ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలను ఆర్‌బికె కేంద్రాలు, కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లలో అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

తూర్పున తుపాను 'ముంపు'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో తూర్పు మండలాలో అనేక ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అనేక గ్రామాలకు రాకపోకలు తెగిపోయాయి. రేణిగుంట విమానాశ్రయానికి వచ్చే విమానాలను సైతం చెన్నయ్‌కు మళ్లించారు. తిరుమల ఘాట్ రోడ్డులలో కొండచరియలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. తిరుమలకు నడిచివెళ్లే శ్రీవారి మెట్టు మార్గాన్ని సైతం మూసివేశారు. సూళ్లూరుపేట సమీపంలో వాయుగుండం తీరాన్ని దాటడంతో జిల్లాలోని తూర్పు మండలాలపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పినా, తీరం దాటాక ప్రభావం తక్కువనే చెప్పాలి. అయినా వాతావరణం దీపావళి వరకూ వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయి. మరోవైపు ఈనెల 22న మరో అల్పపీడనం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది.

బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి పుదిచ్చేరి సూళ్లూరుపేట మధ్య తీరాన్ని దాటింది. ఈ కారణంగా మూడు రోజుల పాటు జిల్లాలో ఎడతెరపి లేని వానలు కురిసాయి. ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన వర్షాలు 15, 16 తేదీలలో పూర్తిగా జడవానగా మారింది. గురువారం తెల్లవారుజామున తెరపిచ్చింది. ఈ వర్షాలకు జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలామయం అయ్యాయి. చిరు వ్యాపారులు, రెక్కాడితే కానీ డొక్కాడని కార్మికులు, పేద సామాన్య ప్రజలు బిక్కు బిక్కుమంటూ మూడు రోజుల పాటు ఇళ్లకే పరిమితమయ్యారు. తిరుపతిలోని మారుతినగర్, కొర్లగుంట, శివజ్యోతినగర్, కొత్తపల్లి, పూలవానిగుంట, కొరమేనుగుంట, ఆటోనగర్, ఉప్పంగి హరిజనవాడ, లక్ష్మీపురం కూడలి, ముంపు సమస్యలు నెలకొన్నాయి. వెస్ట్చర్చి, డిఆర్ మహల్, ఆర్‌సి రోడ్డు అండర్‌బ్రిడ్జిల వద్ద వర్షపునీరు నిలిచిపోవడంతో ఆ దారుల్లో రాకపోకలు నిలిపివేశారు. కపిలతీర్థం, మాల్వడిగుండం కాల్వలు ఉదృతంగా ప్రవహించడంతో ఆ ప్రాంతాల్లో ఉన్న వారిని ఖాళీ చేయించి అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అధికారులు నగరంలో 17 ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 995 కుటుంబాలకు చెందిన 2691 మందికి ఆశ్రయం కల్పించారు. లోతట్టు ప్రాంతాల్లోని కొన్ని కుటుంబాలు పునరవాస కేంద్రాలకు వచ్చేందుకు నిరాకరించడంతో సుమారు 300 మందికి వారి వారి ఇంటి వద్దన్న రెండు రోజులు పాటు ఆహారాన్ని అందించారు. సూళ్లూరు పేటలో అన్నదాతలు కుదేలయ్యారు. సూళ్లూరుపేట, తడ, దొరవారి సత్రం మండలాల్లో ఈ సీజన్‌లో 8వేల ఎకరాలు వరి పైర్లు సాగు చేశారు. ఇందులో 1500 ఎకరాలకుపైగా పంట కొట్టుకుపోయింది. అనేక చోట్ల పైర్లు నీటమునిగాయి. వెంకటగిరిలోని చిన్నన్నపేట వద్ద కల్వర్టు దెబ్బతింది. ఏర్పేడు మండలం గుడిమల్లం వద్ద ఉన్న కాజ్‌వేపైకి నీరు వెల్లడంతో రాకపోకలు నిలిపివేశారు. వరదయ్యపాళెం మండలంలోని సిఎల్ఎన్‌పల్లి, కలత్తూరు, మరదవాడ, అంబూరులో వరినారు నీటమునిగాయి. పొలాలు ఇసుక మేట వేసింది. తిరుమల ఘాట్‌రోడ్డులో కొండ చరియలు విరిగిపడడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడింది. తిరుమలకు భక్తులు నడిచివెళ్లే శ్రీవారి మెట్టుమార్గంలో వర్షపునీరు ప్రవహించడంతో ఆ మార్గన్ని తాతాల్కికంగా టిటిడి అధికారులు మూసివేశారు. కపిలతీర్థం పుష్కరణిలో వర్షపునీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పుస్కరణిలోకి భక్తులను నిరాకరించారు. మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ సెలువు ప్రకటించారంటే వర్షం ప్రభావం ఎలా ఉందో అర్థమవుతుంది. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంతో ప్రాణహాని తప్పడం గమనార్హం. తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు, ప్రజలకు నష్టపరిహారాన్ని జిల్లా యంత్రాంగం అంచనా వేసి, వీలైనంత తర్వగా బాధితులకు అందజేసి, వారిని ఆదుకోవాలని రైతుసంఘాల నేతలు కోరుతున్నారు.



ప్రజాదృష్టి

ఇళ్ల మధ్య కోళ్ల ఫారాలు

- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- దోమలు, పురుగులతో అవస్థలు



ఇళ్ల మధ్యలో నిర్మించుకున్న కోళ్ల ఫారాలు

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని పసుపుతూరు పంచాయతీ మార్చేపల్లి గ్రామంలో కోళ్ల ఫారాలను ఇండ్ల మధ్యనే ఏర్పాటు చేయడంతో కోళ్ల ఫారాల నుంచి వచ్చే దుర్వాసనకు కనీసం భోజనం చేయడానికి కూడా వీలుకావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోళ్ల ఫారాలు ఉండటంతో దోమలు అధికం కావడమే కాకుండా పురుగులు, ఈగలు ఆహార పదార్థాలపై వాలి రోగాలు పాలవుతున్నామని ప్రజలు తెలిపారు. కొద్దిపాటి వర్షం పడితే చాలు ఇక కోళ్ల పారాల నుంచి వచ్చే దుర్వాసన అధికమై ఇళ్లలో కాదు కదా.. ఆ చుట్టుపక్కల కూడా ఉండలేని పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఊరికి దూరంగా పెట్టాల్సిన కోళ్ల ఫారాలను ఊరి మధ్యలో పెట్టడం వలన నానా ఇబ్బందుల పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు.

కోళ్లకు తెగుళ్లు, రోగాలు వచ్చి చనిపోతే వాటిని గ్రామ సమీపంలో పారవేయడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి కుక్కలు అధికసంఖ్యలో అక్కడికి చేరుకుని కోళ్లను తిని మిగిలిన భాగాలను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నాయి. ఇలా తరచూ కోళ్లను తినడం అలవాటు పడిన కుక్కలు కోళ్లు లేనప్పుడు మేక, గొర్రె పిలలు, పెంపుడు కోళ్లపై దాడి ఎత్తుకుపోయిన సందర్భాలు అనేకమున్నాయి. అంతేకాకుండా కోళ్లఫారం వలన పాముల బెడద ఎక్కువైందని, రాత్రి సమయంలో విషసర్పాలు ఎక్కువ సంచరించడంతో బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన దుస్థితి నెలకొందని చెబుతున్నారు.

కోళ్ల ఫారాలు గ్రామంకు దూరంగా కట్టుకోవాలని అయితే కొంతమంది ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వారి ఇష్టానుసారంగా గ్రామంలోని కోళ్ల ఫారాలు నిర్మించుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. ఇది చట్టరీత్యా నేరమని తెలిసినా పట్టించుకోవడం లేదు. ఈ సమస్యపై అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ప్రయోజనం లేకపోయిందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో ఉన్న కోళ్ల ఫారాలను తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కోసల నగరంలో సమస్యల తిష్ట



మురుగునీటి కాలువలు పూడిపోయి పిచ్చిమొక్కలు పెరిగిన దృశ్యం

ప్రజాశక్తి- విజయపురం: మండల పరిధి కోసల నగరంలో సమస్యలు తిష్ట వేశాయి. ఈ గ్రామంలో సుమారు 200 పైగా కుటుంబాలు నివాసముంటున్నారు. కానీ వారికి కనీస వసతులు కూడా లేవు. ఈ గ్రామంలో చాలా సంవత్సరాలకు ముందు తవ్విన కాలువ మాత్రమే ఉన్నాయి.. అవి కాస్తా పూడిపోయాయి.. కనీసం పూడికతీత పనులు కూడా చేపట్లేదు అధికారులు. గ్రామాల్లో ఉన్న మురుగునీటి కాలువల్లో నీరు వెళ్లే మార్గం లేక నిల్వ చేరిపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని, దుర్వాసనతో ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అంతేకాకుండా చుట్టుపక్కల పిచ్చి మొక్కలు వేపుగా పెరిగి ప్రమాదకరంగా మారాయి. పిచ్చిమొక్కల్లో విషసర్పాలు తిరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధి దీపాలు కూడా అంతంత మాత్రమే ఉండడంతో సాయంత్రం పూట ఆరుబయట అడుగు పెట్టాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అలాగే తాగునీరు కొళాయిలు మరమ్మతుకు గురి కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. దీనిపై గతంలో ఎన్నోసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కాలువలు పూడిక తీత్ర పనులు చేపట్టి పారిశుద్ధ్యని మెరుగుపరిచి, తాగునీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


మూలనపడ్డ చెత్త ట్రై సైకిల్

- రోడ్డుపైనే చెత్తా చెదారం





గ్రామంలోని రోడ్లపై పేరుకుపోతున్న చెత్తాచెదారం





నిరుపయోగంగా మూలపడి తుప్పు పట్టిన చెత్త ను తరలించే ట్రైసైకిళ్లు

ప్రజాశక్తి- విజయపురం (నగరి)

నగిరి పట్టణ రూరల్ పరిధిలో చెత్తసేకరణ ట్రై సైకిల్ మరమ్మతుకు గురై మూలనకు చేరటంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. నగిరి గ్రామపట్టణ పరిధిలో చెత్తసేకరణ కోసం గత ప్రభుత్వం ట్రై సైకిల్ కేటాయించింది. అయితే అవి మరమ్మతులకు గురికావడంతో అధికారులు వాటిని మూలన పడేశారు. దీంతో స్థానిక ప్రజలు వాడే చెత్త చెదారం రోడ్డు పక్కన వేయడంతో పారిశుధ్యం లోపించింది. రోడ్డు పక్కన ఉన్న చెత్త పందులకు ఆవాసస్థలంగా మారింది. చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో ద్విచక్ర వాహనదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా సమీపంలో అంగన్వాడీ కేంద్రం ఉండడంతో చిన్నారుల సైతం ముక్కు మూసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

దోమలకు నిలయం..

మండలం, పట్టణ పరిధిలో పారిశుధ్యం లోపించడంతో దోమలు అధికమవుతున్నాయి. ఫలితంగా రాత్రిపూట ప్రజలకు కునుకు లేకుండా పోతోంది. అంతేకాకుండా కొన్నిచోట్ల దోమకాటు వలన జ్వరంతో ప్రజలు ఆసుపత్రి పాలవుతున్నారు. మరికొన్ని చోట్ల జలుబు, దగ్గు వివిధ రకాల వ్యాధితో బాధపడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

పట్టణ పరిధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. కనీసం ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పారిశుధ్యంపై జిల్లా యంత్రాంగం అవగాహన కల్పిస్తున్న అధికారులు ఎలాంటి మార్పు కనిపించలేదని, ఫలితంగా స్థానిక ప్రజలు కూడా పారిశుధ్యంపై అవగాహన లేకపోవడంతో చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. ఇటీవల తడి, పొడి చెత్తను వేరు చేయాలని ప్రజలకు అందించిన చెత్తబుట్టలు మూలకు చేరడంతో చెత్త రోడ్డుకు చేరింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకొని పారిశుధ్య మెరుగుపడేలా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

17 పంచాయతీల్లో రూ.3.6 కోట్లతో పనులు ప్రారంభం

కూటమి ప్రభుత్వంలో పల్లెప్రగతి మొదలయ్యింది. పూతలపట్టు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే మురళీమోహన్ శంకుస్థాపనలు చేస్తున్నారు. అధికారులు నిర్దేశించిన పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ప్రజాశక్తి- పూతలపట్టు : గత ప్రభుత్వంలో పల్లెల అభివృద్ధి పూర్తిగా పడకేసింది. పంచాయతీల్లో నిధులివ్వ లేకుండా నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లించడంతో పంచాయతీల్లో పారిశుద్ధ్యం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారింది. ఇక అభివృద్ధి కార్యక్రమాలు అయితే పూర్తిగా కనుమరుగయ్యాయి. సర్పంచులు నామమాత్రంగా ప్రేక్షకపాత్ర వహించాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చింది. గతంలో ఎన్నా కాకుండా ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీల్లోకి జమ చేసింది. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వైపు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని ప్రజలు హర్షంవ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లపాటు గ్రామీణ ప్రాంతాల్లో పడిన కష్టాలు ఇక తొలగుతాయని గ్రామీణ అంటున్నారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే మురళీమోహన్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్నారు.

ఎన్ఆర్‌జిఎస్ నిధుల ద్వారా..

పూతలపట్టు మండలంలో మొత్తం 25 పంచాయితీలు ఉన్నాయి. ఇందులో మొదటి విడతగా 17 పంచాయితీల్లో రూ.3.6కోట్లతో సీసీ రోడ్లు, మురుగు కాలువల సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు జరిగాయి. స్వచ్ఛత నినాదం ద్వారా పారిశుద్ధ్య కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. ఎట్టకేలకు గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందనున్నాయని గ్రామీణ వాసులు అంటున్నారు. అత్యధికంగా మండలంలోని ఎర్రచెరువుపల్లె రూ.35.50లక్షలు, పేటమిట్ట రూ.33లక్షలు, వావిల్‌తోట రూ.34.5లక్షలు, ఎం.బండపల్లి రూ.21.5లక్షల నిధులు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా అవసరమైన కొద్ది నిధులు కేటాయించి సీసీ రోడ్లు మురుగునీటి కాలువల పనులు ప్రారంభిస్తున్నారు.



పూతలపట్టులో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

త్వరితగతన పనులు పూర్తి...

మండలంలో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేసి గ్రామీణ ప్రజలకు వినియోగంలోకి తీసుకురావడానికి తగినచర్యలు తీసుకుంటున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కూడా పూర్తిస్థాయిలో సహకరించాలి.
- నాగరాజు, ఎంపీడీవో పూతలపట్టు.

యాదమరి: కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని మండల అధ్యక్షుడు మొరార్జీ యాదవ్, సర్పంచ్ పత్తిపాటి భగవతిలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఓటివారిపల్లి గ్రామపంచాయతీ కె.గొల్లపల్లె గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.6లక్షలతో మంజూరైన సిసి రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఎపివో బాల, పంచాయతీ అధికారులు శైలజ, మారెళ్ల వెంకటేష్, సుమతి, శ్రీనివాసులు, టిడిపి జిల్లా కార్యదర్శి హేమగిరి, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లెరు అమరనాథ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, సర్పంచ్ హేమయ్య నాయుడు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : పల్లెపండగలో భాగంగా మండలంలో శనివారం పిళ్లారి కుప్పం గ్రామపంచాయతీ మూలూరు ఏపిడబ్ల్యూ గ్రామంలో రూ.15 లక్షల సిమెంట్ రోడ్డు, పుల్లూరు గ్రామపంచాయతీ పద్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ ప్రహరీ గోడలకు రూ.5లక్షలు, వెంకటాపురం గ్రామపంచాయతీ వెంకటాపురం దళితవాడకు రూ.5లక్షలతో మురుగునీటి కాలువలకు ఎండీవో మోహన్ మురళి ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. హేమాద్రి, యాదవ్ సుబ్రహ్మణ్యం రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఏపీవో చంద్రశేఖర్, చిరంజీవి బాబు, టిటి రేఖ, రామ్మూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భరత్ పాల్గొన్నారు.

సోమల: గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకే పల్లెపండుగ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పలు రకాల అభివృద్ధి పనులకు భూమిపూజా కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఉపాధి హామీ ఏపీఓ దినకర్ బాబు అన్నారు. శనివారం పెద్ద ఉప్పరపల్లి, ఆవులపల్లి, అన్నెమ్మగారిపల్లి పంచాయతీలలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.

వెదురుకుప్పం: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలం మొండివెంగనపల్లె పంచాయతీ బలిజ మొండి వెంగనపల్లె గ్రామంలో సిమెంట్ రోడ్డు భూమిపూజ నిర్వహించారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కన్వీనర్ పోటుగారి గంగయ్య, ఉపసర్పంచ్ కే.భాస్కర్‌రెడ్డి, జనసేన యువజన అధ్యక్షులు కావలి సతీష్, పోటుగారి తిరుమలయ్య, కావలి హరినాథ్, జకబ్, సిద్దయ్య, సుమతి, బాలాజీ పాల్గొన్నారు.

గుడిపల్లి: మండలంలోని నాలుగు గ్రామపంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షులు బాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఆగరం గ్రామపంచాయతీ, దానమానపల్లి, కొడతనపల్లి, యమగానపల్లి, గుండ్లసాగరం పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. క్లస్టర్ ఇంచార్జ్ హేమశేఖర్ గౌడ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు పల్లె పండుగ: ఎంపిడీవో

గుడిపాల: 20వ తేదీ ఆదివారం జరిగే పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుడిపాల ఎంపిడీవో శివరాజ్ శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ నగరాల్లు, 197 రామాపురం, సంగమంగళం, పానాటూరు,189 కొత్తపల్లి, రామభద్రాపురం, బసవాపల్లి గ్రామాల్లో జరిగే పల్లె పండుగ కార్యక్రమానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ హాజరవుతారన్నారు. పలు సిసి రోడ్లకు శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పెద్దపంజాణి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంతో గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని టిడిపి నాయకులు భాను ప్రతాప్‌రెడ్డి అన్నారు. రూ.5.50లక్షలతో సిమెంట్ రోడ్డు మంజూరు కావడంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రిజ్వాన, శివ, ఇంజినీరింగ్ సహాయకులు శ్రీకాంత్, టిడిపి నాయకులు బాలకృష్ణారెడ్డి, మంజునాథరెడ్డి, నాగరాజు యాదవ్, చంద్ర యాదవ్, జైపాల్ రెడ్డి, ఎల్లప్ప, గణేష్, అమరనాథ్, మునింద్ర పాల్గొన్నారు.

దళిత ఉద్యోగుల హక్కులను కాలరాయొద్దు

ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు



బెంగళూరు సదస్సులో ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దళిత ఉద్యోగుల హక్కులను కాలరాయొద్దని ప్రభుత్వ సంస్థలకు చిత్తూరు పార్లమెంటు సభ్యులు, జాతీయ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు సూచించారు. వారి మనోభావాలను దెబ్బతీయద్దని కోరారు. ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులకు రాజ్యాంగపరంగా, శాసనపరంగా కల్పించిన హక్కులు, ప్రత్యేక రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఉద్యోగుల విషయంలో ప్రభుత్వ సంస్థలు ఎలా నడుచుకోవాలన్న అంశాలపై జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఎప్పటికే కేరళ రాష్ట్రంలోని మున్నార్, కొచ్చి ప్రాంతాల వేదికగా సదస్సులు నిర్వహించిన నేషనల్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు శనివారం కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులోనూ సమీక్షా సమావేశాలు నిర్వహించారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ సారధ్యంలో నిర్వహించిన ఈ సమావేశాలలో కర్ణాటక రాష్ట్ర చీఫ్ సెక్రటరీ డాక్టర్ షాలిని రాజ్ నీష్‌తో కలిసి ఎంపి పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.3.30లక్షల విరాళం



చంద్రబాబుకు చెక్ అందజేస్తున్న నాగేశ్వరరావు లావణ్య

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లను ఎట్టేరి శ్రీ భానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, సీబీఎస్ఈ స్కూల్ కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ లావణ్యలు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలో వరద బాధితుల సహాయార్థం శ్రీ భానోదయ స్కూల్ నిర్వాహకులైన లావణ్య, నాగేశ్వరరావు దంపతులు ఆధ్వర్యంలో రూ 3.30 లక్షల చెక్‌ను అమరావతిలో సీఎంకు అందజేశారు.

పివికేఎన్ క్రీడామైదానంలో

టపాకాయల అమ్మకాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: దీపావళి పండుగ పురస్కరించుకుని చిత్తూరు పట్టణంలో టపాకాయల అమ్మకానికి పివికెఎన్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌ను ఖరారు చేసినట్లు చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టపాకాయల అమ్మకానికి స్థలనిర్ధారణ విషయమై అగ్నిమాపక, పోలీస్‌శాఖ, మున్సిపల్ శాఖ, విద్యుత్‌శాఖ, సెక్రెటరీ మార్కెటింగ్, ఇరిగేషన్ శాఖ, టపాకాయల అసోసియేషన్ డీలర్స్ తదితరులతో వన్‌మాన్ కమిటీ నియమ నిబంధనలను అనుసరించి చిత్తూరు ఆర్‌డిఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. టపాకాయల అమ్మకానికి పివికెఎన్ డిగ్రీ కళాశాల, మార్కెట్ యార్డ్‌ను పరిశీలించగా చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌ను ప్రజలకు సౌకర్యంగా గుర్తించి ఖరారు చేయడం జరిగిందని తెలిపారు.

జడ్జి ఆకస్మిక తనిఖీలు



ప్రజాశక్తి- పలమనేరు: పట్టణ సమీపంలోని గురుకుల పాఠశాలలో పలమనేరు జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి లిఖిత శనివారం ఆకస్మికంగా తనిఖీలను చేపట్టారు. ఆ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు సాయంత్ర వేళల్లో అందించే అల్పాహారాన్ని వంటగదిని పరిశీలించారు. అలాగే నిత్యావసర సరుకులు, కాయగూరలు నిల్వ ఉన్న గది, వంటగది పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు వైద్యం అందించే వైద్య బృందంతో మాట్లాడి ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించి నాణ్యమైన వైద్యాన్ని అందించి అందరూ ఆరోగ్యంగా ఉండేటట్లు చూడాలని సూచించారు. భోజనాలు పరిశుభ్రంగా వండి రుచిగా విద్యార్థులకు అందించాలన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు పలమనేరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా ఈ తనిఖీలను చేపట్టామని ఆమె పేర్కొన్నారు. పలమనేరు బార్ అసోసియేషన్ కార్యదర్శి భరత్, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రూ.1,45,000 జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు వాహన తనిఖీచేస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 13 మంది శుక్రవారం పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో శనివారం ప్రవేశపెట్టగా జడ్జి ఉమా దేవి వాహనదారులకు 13 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.1,30,000లు, రెండవ సారి మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రూ.15,000లు మొత్తంగా రూ.1,45,000లు జరిమానా విధించడం జరిగింది. ఈ 10నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన 424 మందికి సుమారు రూ.42.5లక్షల ఫైన్ విధించడం జరిగింది. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లాలోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు తెలిపారు.

మెడికల్ రెప్ ఆత్మహత్య

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని మెకానికల్ గ్రౌండ్ వద్ద ఉన్న రైల్వే ట్రాక్‌పై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శనివారం మధ్యాహ్నం 12.15 నిమిషాల ప్రాంతంలో మెకానికల్ గ్రౌండ్ వద్ద ఉన్న రైల్వే ట్రాక్ పై తిరుపతికి చెందిన సిప్లా మెడికల్ కంపెనీ థెరపి మేనేజర్ తేజేశ్వర్ రెడ్డి అనే వ్యక్తి రైల్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు రైల్వేస్టేషన్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌కు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తును ప్రారంభించారు. ఆత్మహత్యకు గల కారణాలు పోలీసులు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.



రైల్వే ట్రాక్‌పై పడి ఉన్న మృతదేహం

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ప్రజాశక్తి- పూతలపట్టు: రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం ఉదయం పూతలపట్టు కానిపాకం రోడ్డులో జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సీఐ కృష్ణమోహన్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మనోహర్, క్రీడావిభాగపు సెక్రటరీ మోహన్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎంపికైన విద్యార్థులు ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పిడి కృష్ణయ్య తెలిపారు. పూతలపట్టు పీఈటి ఢిల్లీ రాని ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్లు



ప్రజాశక్తి- చౌడేపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం చిత్తూరు జిల్లా స్థాయిలో ఎస్‌జిఎఫ్ కబడ్డీ సెలక్షన్స్ నిర్వహించారు. అండర్- 17 బాలికల పోటీల్లో పల్లవి, లిఖిత, సన, పంచల లోహిత, సోఫియా, అంజుమ్, హేమావతి, హేమశ్రీ, శాలిని, భాగ్యశ్రీ, కౌసల్య, సంధ్య, అనిత, దోలశ్రీ, నందిని, రమ్యలు ఎంపికయ్యారు. ఈఅదేవిధంగా బాలుర విభాగంలో సందీప్, తిరుమలేష్ యాదవ్, మహేంద్ర నాయుడు, మనోజ్, నిరంజన్, జాన్ పీటర్, చరణ్, సంజయ్, దర్శన్, శివ కేశవులు అండర్ -17 బాలుర జట్టుకు ఎంపికయ్యారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కేసి.నవీన్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వసంత వాణి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సుధాకర్, వైస్‌చైర్మన్ రాధిక, కబడ్డీ రామచంద్ర, పీడీలు వెంకటేష్, అజయ్, సురేష్, నితిన్, మధులత, హెచ్‌ఎం నాగరాజరెడ్డి, నాయకులు మనిసింగ్, అర్జున్, పవన్ కుమార్‌రెడ్డి, ప్రసాద్, పీఈటీ రాజేంద్ర పాల్గొన్నారు.

'వాక్ ఫర్ ఫ్రీడం' నిశ్శబ్ద నడక

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించేందుకు గ్లోబల్ 'వాక్ ఫర్ ఫ్రీడమ్' ఐరాల ఎడిషన్‌లో శనివారం కళాశాలలు, ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల నుంచి 150 మందికి పైగా పౌరులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈకార్యక్రమాన్ని రెడ్డిరామరాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నిలబడి గళం విప్పాలన్నారు. వాక్ ఫర్ ఫ్రీడమ్ ద్వారా మానవ అక్రమరవాణా కారణంగా బాధితులైన ప్రజల కోసం నిలబడతామని, ఆధునిక బానిసత్వం నుంచి విముక్తి చేయడానికి అందరం చేతులు కలుపుదామని పిలుపునిచ్చారు.

మూడు గ్రామాలలో వైద్య సేవలు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది 104 వాహన సిబ్బంది ఇరికిపెంట పంచాయతీ గంగిరెడ్డివారిపల్లి, ఎర్రనాగుల వారిపల్లి, మేటిమంద గ్రామాలలోని 150 కుటుంబాలలోని ప్రజలకు శనివారం వైద్యసేవలను అందజేశారు. గ్రామంలోని వృద్ధులకు పిల్లలకు వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులు మాత్రలను పంపిణీ చేశారు. బిపి, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని గుర్తించి వారికి ప్రతి మూడో శనివారం 104 వాహనం ద్వారా వైద్యసేవలు అందించడం జరుగుతుందని వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి, సిహెచ్‌ఓ అమర్నాథ్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్ హెచ్‌పి శాంభవి, ఏఎన్‌ఎం మదనిక, ఆశా కార్యకర్తలు శ్రీలక్ష్మి ,నాగరత్న, గుణవతి పాల్గొన్నారు.

వైద్యవిద్యపై చర్చా కార్యక్రమం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: పట్టణంలోని పిఈఎస్ వైద్య కళాశాలలో డీన్, ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్‌ఆర్. కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం సతత వైద్యవిద్యపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బెంగళూరు నగరంలోని యాంటీ రేబిస్ క్లినిక్ డాక్టర్ గిరియన్న గౌడ, టాక్సికాలజిస్ట్, కృష్ణగిరిలోని టీసీర్ హాస్పిటల్ డాక్టర్ సీ.సౌందర రాజ్, కోలార్ రీజియనల్ రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ నటరాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జంతువుల, పాముల కాటు, జూనోటిక్ వ్యాధులు, ఎమర్జింగ్ వన్‌హెల్త్ ధోరణుల గురించి చర్చించారు. రాయలసీమ ప్రాంతంలోని కమ్యూనిటీ మెడిసిన్, ఇతర స్పెషలిటి నుంచి 200 మంది పీజీ విద్యార్థుల కోసం రూపొందించినట్లు తెలిపారు.

50 పడకల ఆసుపత్రిలో

ఘనంగా తొలి వార్షికోత్సవం



ప్రజాశక్తి- సదుం: సదుంలోని 50 పడకల ఆసుపత్రి ఏర్పాటైన సంవత్సరం పూర్తి కావడంతో సిహెచ్‌సిలో శనివారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇ.పుష్పకుమారి ఆధ్వర్యంలో ఘనంగా తొలి వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. ఈసందర్భంగా పూజలు చేసి సిబ్బందికి ప్రసాదం పచిపెట్టారు. అనంతరం పుష్పకుమారి మాట్లాడుతూ సదుంలో 50 పడకల ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలతో రోగులకు వైద్యసేవలు అందిస్తున్నామని, ప్రజలు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిహెచ్సి ప్రారంభమై విజయవంతంగా వైద్య సేవలందిస్తూ సంవత్సరం పూర్తికావడం సంతోషంగా ఉందన్నారు. సిహెచ్సి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, సిటీ రమాదేవి మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్లు రూపానంద్, సోమేశ్వర రెడ్డి, భార్గవి, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, స్టాఫ్ నర్సులు శ్రీదేవి, దీపారెడ్డి, అనిత, మాధవి, శశికళ, వాసంతి, సీనియర్ అసిస్టెంట్ హరీష్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా బోధన: ఎంఈవో

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : ప్రణాళికాబద్ధంగా బోధన ఉండాలని ఎంఈవో శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని వేలావడి ఉర్దూ పాఠశాలను ఆమె తనిఖీ చేసి ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యాసంవత్సరంలో చేపట్టవలసిన కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. ఆ మేరకు రికార్డులు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు.

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: స్థానిక జూనియర్ కాలేజీలో 2000-2002 విద్యా సంవత్సరంలో తమతోపాటు ఇంటర్ చదువుకున్న బలరాంరెడ్డి (42) మరణించిన విషయం తెలుసుకున్న స్నేహితులు వారి కుటుంబానికి రూ.71,000లు ఆర్థిక సాయాన్ని అందించారు. శనివారం గోవిందవారిపల్లిలోని బలరాంరెడ్డి భార్య సుల్తాను భానుకు నగదును అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉమేష్, పోటుగారి భాస్కర్ మాట్లాడుతూ తమతో చదువుకున్న స్నేహితుడి మరణవార్త తెలిసి వారి కుటుంబానికి ఆర్థికసాయం అందించడం హర్షించదగ్గ విషయమన్నారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని పీఈఎస్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసినందని అడ్వైజర్ డాక్టర్ ఏ.మహేష్ తెలిపారు. కంటి సమస్యతో బాధపడుతున్న వారు పెద్ద సంఖ్యలో శిబిరంలో పాల్గొన్నారని, వారందరిని పరీక్షించిన వైద్యులు అందులో 31 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. వీరందరికీ స్థానిక పిఈఎస్ ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

ఉత్తమ నర్సులుగా ఎదగాలి

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం నర్సింగ్ కళాశాలలో శనివారం దీపం వెలిగించే కార్యక్రమాన్ని బిసిఎన్ విద్యాసంస్థల అధ్యక్షులు బిసి.నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కెసి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వైద్యరంగంలో నర్సులకు ఉన్న ప్రాముఖ్యతను వివరించి ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, ఉత్తమ నర్సులుగా ఎదగాలని సూచించారు.

నారా లోకేష్ కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కుప్పం నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో భాగంగా స్వర్ణకారుల పరిస్థితులను అర్థం చేసుకున్న నారా లోకేష్ అధికారం వచ్చిన వెంటనే స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే ఇచ్చిన హామీని నెరవేరుస్తూ స్వర్ణకారుల జీవితాలలో వెలుగు నింపిన సిఎం, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

'బాలికకు న్యాయం చేయాలి'

ప్రజాశక్తి- కుప్పం టౌన్

రజక కులానికి చెందిన పేద బాలికకు న్యాయం చేయాలని రాష్ట్ర రజక సంఘాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు పి.షణ్ముగం డిమాండ్ చేశారు. శనివారం కుప్పం పట్టణ పరిధిలోని దోబీ ఘాట్‌లో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిపురం మండలం శెట్టిగాని కురుబూరు గ్రామపరిధిలో నివాసం ఉంటున్న బాలికపై అదే గ్రామానికి చెందిన మాజీ వాలంటీర్ వెంకటాచలం అఘాయిత్యానికి పాల్పడ్డట్టు తెలిపారు. వైసిపికి చెందిన నిందితుడు సుమారు 8 నెలల క్రితం అప్పటి అధికార పార్టీ అండదండలతో ధన మదంతో బాలికపై అత్యాచారం చేసి, ఈ విషయాన్ని బయట పెడితే ప్రాణాలు తీస్తామని బెదిరించినట్టు ఆరోపించారు. భయాందోళనకు గురైన చిన్నారి తనకు జరిగిన అన్యాయాన్ని కనీసం తల్లిదండ్రులకు కూడా చెప్పలేదన్నారు. గత కొద్ది రోజులకు ముందు చిన్నారి కడుపునొప్పి అని చెప్పగా ఆసుపత్రికి తీసుకెళ్లిన తల్లిదండ్రులకు వైద్యులు బాలిక గర్భం దాల్చినట్టు చెప్పడం జరిగిందన్నారు. ఈ విషయమై చిన్నారిని విచారించిన తల్లిదండ్రులు నిందితున్ని ప్రశ్నించడం జరిగిందన్నారు. అయినా నిందితుడు పట్టించుకోకుండా దురుసుగా ప్రవర్తించడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించడం జరిగిందన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు బాధితుల పక్షాన నిలిచి విచారణ చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వం సైతం స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఆర్.మోహన్, కుప్పం నియోజకవర్గం అధ్యక్షులు టి.రంగనాథ్, నరసింహులు, విశ్వ, మురళి, టీవీ వెంకటాచలం, గోవిందరాజులు, వెంకటేష్, శ్రీనివాసులు, నరేష్, రత్నమ్మ, రాణి, మీనమ్మ పాల్గొన్నారు.



పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు: డిపిఓ



సిబ్బందితో మాట్లాడుతున్న డిపిఓ పార్వతి

ప్రజాశక్తి- వి కోట: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే పంచాయతీ కార్యదర్శులపై కఠినచర్యలు చేపడతామని చిత్తూరు డిపిఓ పార్వతి సిబ్బందిని హెచ్చరించారు. మండల కేంద్రమైన వి కోటలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆవాసాల మధ్య నీటి నిల్వలు ఉండకుండా చూడాలని ఫాగింగ్ చేపట్టి దోమల నివారించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని, మురుగునీటి కాలువలు శుభ్రపరిచి వ్యర్థాలను ఊరి చివరకు తరలించాలని ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో తప్పనిసరిగా 100శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. నూతనంగా విధుల్లో చేరిన పంచాయతీ సిబ్బంది విధిగా గ్రామపంచాయతీ కార్యాలయంలో 34రికార్డులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నిధులను నిర్దేశించిన పనులకే కేటాయించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ అభివృద్ధికి పంచాయతీ కార్మికులే మూలస్తంభాలని వారి సంక్షేమం గ్రామపంచాయతీ బాధ్యతని తెలిపారు. ఈసందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన వస్తువులను అందజేశారు. సర్పంచ్ పిఎన్ లక్ష్మి, ఈవో శివ శంకరయ్య, ఇంచార్జ్ ఈవోపీఆర్‌డి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి- పెద్దపంజాణి: రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పట్టు పరిశ్రమశాఖ ఏఎస్ఓ చౌదరి తెలిపారు. శనివారం మండల వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రాజుపల్లి రైతు సేవాకేంద్రం పరిధిలో పట్టు పరిశ్రమశాఖ ద్వారా పట్టు రైతులకు ప్రభుత్వం మంజూరు చేసే సబ్సిడీలు ప్రోత్సాహకాలను అలాగే పంటలో చేపట్టాల్సిన మెలకువలు గురించి రైతులకు తెలియజేశారు. వ్యవసాయ, ఉద్యానశాఖ పశు సంవర్ధక, మార్కెటింగ్ శాఖల అధికారులు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు బాలాజీ, అనిల్, రెహమాన్, మహేష్, శ్రీను, టిడిపి నాయకులు భాను ప్రతాప్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ఖర్చు చేసిన డబ్బులు ఇప్పించండి

సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన సర్పంచులు

ప్రజాశక్తి -సదుం

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఉపాధ్యక్షుడు వి.ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు మనోహర్ రెడ్డి, చల్లా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వీధి దీపాల కోసం ఖర్చు చేసిన డబ్బులు పంచాయతీ నిధుల నుండి ఇప్పటి వరకు తమకు అందలేదని, వెంటనే ఇప్పించాలని కోరారు. తిమ్మా నాయనపల్లి గ్రామపంచాయతీ సర్పంచి లోకనాథ్ రెడ్డి తమ ఊరు మీదుగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఈ విషయం పెద్దల దృష్టికి తీసుకువచ్చినా బస్సు సర్వీసు రాలేదని తెలిపారు. జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ నిధుల నుండి వీధి దీపాలు ఖర్చులు సమకూరుస్తామని, బస్సు సర్వీసు విషయంపై ఆర్టీసీ అధికారులతో మాట్లాడి తిమ్మాన నాయన పల్లి రూట్లో బస్సు సౌకర్యం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఏవో హరిబాబు అజెండా విషయాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 అమరావతి, కో ఆప్షన్ నెంబర్ ఇమ్రాన్, తహశీల్దార్ మారూఫ్ హుస్సేన్, ఈవోపిఆర్డి వరప్రసాద్, ఎంపీటీసీలు మల్లికార్జున, వాసు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

